సాక్షి
బాపట్ల
మంగళవారం : 26 : మార్చి : 2024



ముగిసిన దుర్గమ్మ తిరునాళ్లు

తెనాలిటౌన్: పట్టణ బాలాజీరావుపేటలోని ప్రధాన అయ్యప్ప దేవాలయంలో జరుగుతున్న దుర్గమ్మ తిరునాళ్లు సోమవారంతో ముగిశాయి. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కల్యాణ మహోత్సవం

దుర్గి: దుర్గిలో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
బాపట్ల	6.25	4.51
గుంటూరు	6.25	4.51
నరసరావుపేట	6.27	4.53

న్యూస్‌రీల్

బీటీ పత్తి విత్తన ధరలు ఖరారు

కొరిటెపాడు(గుంటూరు): బీటీ పత్తి విత్తన ప్యాకెట్ల ధరలను కేంద్ర ప్రభుత్వం ఖరారు చేసింది. బీటీ-1 విత్తనాల ధరలు కొన్నేళ్లుగా నిలకడగా ఉండగా.. బీటీ-2 పత్తి విత్తనాల ధరలను పెంచుతోంది. విత్తనాలను 450 గ్రాముల ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఇందులో 25 గ్రాములు నాన్ బీటీ పత్తి విత్తనాలు ఉంటాయి. 450 గ్రాముల బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ ధర 2023-24లో రూ.853 ఉండగా, 2024-25 సంవత్సరానికి ప్యాకెట్ ధరను రూ.864లకు పెంచినట్లు స్పష్టమవుతోంది.450 గ్రాముల ప్యాకెట్‌పై రూ.11 పెరిగింది. బీటీ-1పత్తి విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర నిలకడగా రూ.635 ఉంది.

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్య ఊరేగింపు



పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేటలోని లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నేల పొంగళ్లు స్వామి అమ్మవార్లకు నివేదించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, గణపతి హోమం, పోతురాజు స్వామికి నీళ్లు పోసే కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పురవీధులలో ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమాలను కన్నసాని విజయకుమార్, రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

వియత్నాం మీడియా ప్రతినిధులు సాగర్ సందర్శన



నాగార్జునసాగర్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను సోమవారం వియత్నాం దేశ మీడియా ప్రతినిధులు సందర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో వియత్నాం, ఇండియా ఆర్థిక సహకారంలో భాగంగా మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జర్నలిజం-పబ్లిక్ రిలేషన్స్ అనే అంశంపై వియత్నాం మీడియా ప్రతినిధులకు శిక్షణ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, నాగార్జున కొండ మ్యూజియం, సాగర్ డ్యాం తదితర ప్రాంతాలను సందర్శించారు. వీరి వెంట టూరిజం గైడ్ సత్యనారాయణ, తెలంగాణ అధికారులు ఉన్నారు.

ఇద్దరు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సస్పెన్షన్

పెదనందిపాడు(కాకుమాను): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేయని పనులకు ఎఫ్‌టీఓలు మంజూరు చేసిన విషయంలో పెదనందిపాడు ఉపాధి హామీ ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్, అసిస్టెంట్ అకౌంటెంట్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎంపీడీఓ స్వామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో ఏపీఓగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీపతి, కంప్యూటర్ ఆపరేటర్ రాజ్యలక్ష్మి కలసి చేయని పనులకు ఎఫ్‌టీఓలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నివేదిక మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఇరువురిని విధుల నుంచి తొలిగిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

వేద స్మార్త పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో వేద స్మార్త పాఠశాల ఐదో బ్యాచ్ అడ్మిషన్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ వానపాముల రత్నాచార్యులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. తెలుగు చదవటం, రాయటం వచ్చిన వారు అర్హులు అని, వయస్సు 12 నుంచి 15 లోపు ఉండాలన్నారు. విశ్వబ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తు చేసువాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఉచిత భోజనం, వసతి, దుస్తులు ఇవ్వబడతాయన్నారు. ఇతర వివరాలకు వీరబ్రహ్మేంద్ర స్మార్త వేద పాఠశాల, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా, ప్రధానాచార్యులు బ్రహ్మశ్రీ వానపాముల రత్నాచార్యులు (9848442598), బ్రహ్మశ్రీ సిద్ధిహరి ఆచార్య(9963386690), నిర్వాహకులు బ్రహ్మశ్రీ చింతాడ సూర్యప్రకాష్ (94916 12324)లను సంప్రదించాలన్నారు.

అంజని పుత్ర.. అభయ ప్రదాత

- వైభవంగా శింగరకొండ తిరునాళ్ల
- ప్రసన్నాంజనేయ, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలకు పోటెత్తిన భక్తులు
- వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటుతో సందడి
- మజ్జిగ, మంచినీరు, ఉచిత లడ్డూ, పులిహోరను పంపిణీ చేసిన దాతలు

అద్దంకి/అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, కొండపైనున్న లక్ష్మీనరసింహస్వామి 69వ వార్షిక తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచే క్షేత్రం కిక్కిరిసిపోయింది. ఆలయ పరిసరాలు విద్యుత్ బల్బులతో కాంతులీనాయి. ఏసీ సుభద్ర ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిబ్బంది సహకారంతో భక్తులకు అసౌకర్యం కలుగకుండా, ఉచిత దర్శనంతో పాటు, వీఐపీ, వికలాంగులకు ప్రత్యేక దర్శన క్యూలైన్లను ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో భక్తులకు మజ్జిగ, మంచినీరుతో పాటు, దర్శనం చేసుకున్న భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. పలు బ్యాంక్ బ్రాంచ్‌లు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీటిని ఉచితంగా పంపిణీ చేశారు.

ప్రత్యేక పూజలు

ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి, చీరాల ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ , ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు స్వామికి చక్కెర పొంగలి వండి, కుండలను నెత్తిన పెట్టుకుని దర్శనంతో మొక్కులు తీర్చుకున్నారు. కొండ మీద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దేవదాయశాఖ ఈవో కోటిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం, సామూహిక వ్రతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక బస్సులు

అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి 30 ప్రత్యేక బస్సులను నడిపారు. వీటితోపాటు జిల్లాలోని వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట, ఒంగోలు, దర్శి, పొదిలి తోపాటు వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడిపారు. కొండమీద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి భవిష్య పాఠశాలకు చెందిన రెండు బస్సుల్లో భక్తులను ఉచితంగా చేరవేశారు. దత్తపాదుకా క్షేత్ర ఆధ్వర్యంలో దద్ధోజనం పంపిణీ చేశారు.



రథాన్ని లాగుతున్న ఎంపీ సురేష్, అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి



ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్టు



ఆలయ పరిసరాల్లో కిక్కిరిసిన భక్తులు

ఆకర్షణీయంగా దుకాణాలు

తిరునాళ్ల సందర్భంగా క్షేత్రానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బొమ్మలు, చెరుకు విక్రయ దుకాణాలు ఆకర్షణీయంగా నిలిచాయి. వివిధ వస్తువులతో నిర్వహించిన సంతల్లో భక్తులు వస్తువులను కొనుగోలు చేశారు. తిరునాళ్లలో ఏర్పాటు చేసిన జైంట్ వీల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

500 మంది పోలీసులతో బందోబస్తు

శింగరకొండ తిరునాళ్లలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నలుగురు డీఎస్పీలు, ఎనిమిది మంది సీఐలు, 50 మంది సీఐలు, 100 మంది ఏఎస్‌ఐలు, 334 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్ల ఇన్‌చార్జిగా చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ వ్యవహరించారు. సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్‌కు సమస్య తలెత్తకుండా మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి, సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు, మేదరమెట్ల ఫైలాన్ వద్ద భారీ వాహనాలను దారి మళ్లించారు. 99 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ సమీపంలో వాహనాలకు ఉచిత పార్కింగ్ వసతి కల్పించారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో వరుసగా నాలుగో సంవత్సరం రథోత్సవాన్ని సోమవారం ఏసీ సుభద్ర ఆధ్వర్యంలో నిర్విఘ్నంగా నిర్వహించారు. రథంపై ఉత్సవ మూర్తులను ఉంచి, కేరళ వాయిద్యాలతో దేవస్థానం నాలుగువైపులా వీధుల్లో ఊరేగించారు. రథం ముందు వివిధ దేవతామూర్తుల వేషధారణల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జై వీరాంజనేయ అంటూ భక్తులు నినాదాలు చేస్తూ భక్తి పారవశ్యంతో రథాన్ని లాగారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు భక్తులు పాల్గొన్నారు.



రథంపై ఊరేగుతున్న దేవేరులు



దేవతావేషధారుల విన్యాసాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి, కరణం వెంకటేష్

వలంటీర్లపై టీడీపీ ఇన్‌చార్జి 'బొజ్జల' వ్యాఖ్యలు దారుణం

తీవ్రంగా ఖండించిన అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

అద్దంకి: శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి వలంటీర్లను ఉగ్రవాదులతో పోల్చడం దారుణమని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బొజ్జల వ్యాఖ్యలను ఆయన సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కుల,మత, వర్గ పార్టీ రహితంగా సేవలందించే వలంటీర్లను ఉగ్రవాదులతో పోల్చి, వారు గ్రామాల్లో ఎన్నో అరాచకాలు చేశారని, టీడీపీ అధికారంలోకి వస్తే వారిపై డేటా చోరీ కేసు పెట్టి శిక్ష వేయిస్తాననడంపై ఆయన మండిపడ్డారు. తక్షణమే ఆయన ఆవ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ఎలా పని చేశాయో ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి, వలంటీరు వ్యవస్థతో ఇంటికే పింఛన్ అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా ఏ ఇంటికి వెళ్లి అడిగినా వలంటీర్లు అందించిన సేవల గురించి చెప్తారని హనిమిరెడ్డి చెప్పారు.

పోలింగ్ రోజు విధులు అత్యంత కీలకం

గుంటూరు వెస్ట్ : ఎన్నికలు సక్రమంగా, సజావుగా నిర్వహించడంలో పోలింగ్ సిబ్బంది, అధికారులు పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో పోలింగ్ సిబ్బంది శిక్షణ విధానాన్ని పరిశీలించారు. ఒక్కరు తప్పుచేసినా అది ఎన్నికల వ్యవస్థపైనే ప్రమాదం చూపే అవకాశముంటుందని చెప్పారు. పోలింగ్ బూత్‌కు ఎన్ని గంటలకు చేరుకోవాలి, ఓటర్లతో ఎలా ప్రవర్తించాలి, ఏ అంశాలను పరిగణలోనికి తీసుకోవాలి, ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సుల భద్రత తదితర అంశాలను జాగ్రత్తగా గమనించాలని సూచించారు.

తెలంగాణ కృష్ణప్రసాద్‌కు ఎంపీ సీటు

పచ్చ నేతలు హాట్..హాట్

- బాపట్ల టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పొరుగు రాష్ట్రం నుంచి దిగుమతి
- కనీసం ముఖ పరిచయం లేని వ్యక్తికి సీటు కేటాయింపుపై తెలుగుదేశం నేతలు తీవ్ర అసహనం
- బీజేపీ, జనసేన కూటమి పార్టీలో సైతం విస్మయం
- తెలంగాణ వ్యక్తిని రుద్దడం సమంజసమేనా అంటున్న నేతలు



కృష్ణప్రసాద్

చీరాల: ఎంతో ఘన చరిత్ర కలిగిన బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో మొదటిసారి టీడీపీ ఎంపీ అభ్యర్థి సీటును తెలంగాణకు చెందిన టి.కృష్ణప్రసాద్‌కు కేటాయించడంపై ఆ పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు. కనీసం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, అభ్యర్థులతో చర్చించకుండా టీడీపీ అధినేత సీటు ప్రకటించారని వాపోతున్నారు. తెలంగాణ బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ వరంగల్ ఎంపీ సీటు ఆశించిన మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్‌కు ఇక్కడ కేటాయించడంపై విస్మయానికి గురయ్యారు.

ఉండవల్లి శ్రీదేవికి ఝలక్..

తొలుత బాపట్ల ఎంపీ సీటును వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా గెలిచిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి ఖరారు చేసినట్లు ప్రచారం జోరుగా జరిగింది. మాజీ ఎంపీ శ్రీరాం మాల్యాద్రి, టీడీపీ నేత ఎంఎస్ రాజు పేర్లు తెరపైకి వచ్చాయి. ఎవ్వరూ ఊహించని విధంగా రాత్రికి రాత్రే కృష్ణప్రసాద్‌కు పచ్చ కండువా కప్పి బాపట్ల ఎంపీ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంపై స్థానిక నేతలు షాకయ్యారు. పార్లమెంట్ పరిధిలోని బాపట్ల, వేమూరు, రేపల్లె, చీరాల, పర్చూరు, అద్దంకి, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాలకు చెందిన ఉమ్మడి పార్టీల నాయకులు చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. సీనియర్ నేతలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

సామాన్యుడికి పట్టంకట్టిన ఓటర్లు

బాపట్ల లోక్‌సభ నియోజకవర్గం 1977లో ఏర్పడింది. అయితే 2009 పునర్విభజనలో ఎస్సీ రిజర్వ్ స్థానంగా కేటాయించారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 2019 ఎన్నికల్లో చీరాల, రేపల్లె, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. కేవలం బాపట్ల, వేమూరు, ఎస్ఎన్ పాడు నియోజకవర్గాలు వైఎస్సార్ సీపీ విజయం సాధించింది. అయినప్పటికీ బాపట్ల ఎంపీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి సామాన్యుడైన నందిగం సురేష్ విజయం సాధించారు. ఇప్పటికీ ఆయన ప్రజల్లో ఒక కార్యకర్తలాగా తిరుగుతుండటంతో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రం నుంచి దిగుమతి అయిన కృష్ణప్రసాద్‌పై వైఎస్సార్ సీపీ అభ్యర్థి నందిగం సురేష్ విజయం నల్లేరుపై నడకలా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ ఎంపీగా కనీసం పోటీ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. గతంలో విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన కృష్ణ ప్రసాద్ తెలంగాణ రాజకీయాల్లో రాణించాలని ఆశించినప్పటికీ ఆ ఆశలు నెరవేరలేదు.

ఉద్దండుల కోట

బాపట్ల ఎంపీ సీటు అంటే ఒకప్పుడు రాజకీయ ఉద్దండులు, యోధానుయోధులు, అధిక జనాకర్షణ ఉన్న నేతలు పోటీ చేసే నియోజకవర్గం. ఇక్కడ పోటీ చేసిన పలువురు కేంద్ర మంత్రులు, జాతీయ పార్టీలకు అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రులు, ఉప రాష్ట్రపతిగా పని చేసిన ఘనత ఉంది. ముఖ్యంగా గతంలో దేశానికి ఉప రాష్ట్రపతిగా పనిచేసిన ఎం.వెంకయ్యనాయుడు టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. మూవీ మొఘల్ డాక్టర్ రామానాయుడు బాపట్ల ఎంపీగా పోటీచేసి పార్లమెంట్ మెట్లెక్కారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సైతం బాపట్ల ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. నందమూరి తారకరామారావు అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు బాపట్ల నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి కాంగ్రెస్ నుంచి బాపట్ల ఎంపీగా పోటీ చేసి కేంద్ర మంత్రిగా పని చేశారు. ఎస్సీ నియోజకవర్గం కానప్పటికీ గతంలోనే సలగల బెంజిమెన్ వెంకయ్యనాయుడుపై ఎంపీగా గెలిచారు. ఎస్సీ నియోజకవర్గం అయిన తర్వాత పనబాక లక్ష్మి ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రమంత్రిగా పనిచేసిన జేడీ శీలం సైతం బాపట్ల పార్లమెంట్‌కు పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత శీలం రాజ్యసభకు వెళ్లి కేంద్రమంత్రిగా పనిచేశారు. విశ్రాంత ఐఏఎస్‌లు, ఐఆర్ఎస్‌లు సైతం బాపట్ల నుంచే పోటీ చేసేందుకు ఆసక్తి చూపేవారు.

జగనన్నకు అండగా నిలుద్దాం



ఎన్నికల ప్రచారంలో ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే రఘుపతి

- ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే కోన రఘుపతి
- మూలపాలెం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం

బాపట్ల: వైఎస్సార్ సీపీ పాలనలో మీ ఇంట్లో మేలు జరిగితే ఓటు వేయండంటూ ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే కోన రఘుపతి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. బాపట్ల నియోజకవర్గంలోని మూలపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నందిగం సురేష్ మాట్లాడుతూ రాజకీయాల్లో ఎంతో మంది నాయకులను మనం చూసి ఉంటామని వారిలో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకునే నేతలు అరుదుగా ఉంటారన్నారు. సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే ఆ కోవలోకి వస్తారన్నారు. ఇంగ్లిషు మీడియం చదువులను పేదలకు అందించటంతో పాటు ఐక్యరాజ్యసమితిలో సైతం మన విద్యార్థులు మాట్లాడే స్థాయికి తీసుకు వచ్చిన ఘనత మన జగనన్నకే దక్కిందన్నారు. చంద్రబాబు మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు.

మూలపాలెం అభివృద్ధికి రూ.11.20 కోట్ల నిధులు

బాపట్ల మండలంలోని చిన్నమూలపాలెం గ్రామానికి ఐదేళ్లలో రూ.11.20 కోట్లు సంక్షేమ ఫలాలు అందాయని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన తనకు మూడోసారి సైతం ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వటం సంతోషకరమన్నారు. తన ఎన్నికల ప్రచారాన్ని మూలపాలెం నుంచే ప్రారంభించటం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న ఆలోచనలతో రాష్ట్రాన్ని ఐదేళ్ల పాలనలో పరుగులు తీయించారని గుర్తు చేశారు. భావితరాల బంగారు భవిష్యత్‌కు జగనన్న పాలనను మళ్లీ తెచ్చుకుందామని కోన సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, నాయకులు డాక్టరు రుతురాణి, చేజర్ల నారాయణరెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, వడ్డిముక్కల డేవిడ్, కొక్కిలిగడ్డ చెంచయ్య, గవిని కృష్ణమూర్తి, కటికల యోహోషువా, గంగిశెట్టి రత్తయ్య, నర్రావుల వెంకట్రావు, బుల్లిరెడ్డి, ఇమ్మడిశెట్టి అంకమ్మ, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

- పార్టీలకతీతంగా విధులు
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి వాహనం తనిఖీ
- సానుభూతి కోసం లోకేష్ ప్రయత్నాలు

తాడేపల్లిరూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కృష్ణా, గుంటూరు జిల్లా సరిహద్దు అయిన ప్రకాశం బ్యారేజ్ వద్ద 10 రోజులుగా విస్తృత తనిఖీలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆదివారం నారా లోకేష్ కారును తనిఖీ చేయడంతో ఆయన అసహనం వ్యక్తం చేస్తూ తాడేపల్లి ప్యాలెస్ నుంచి తనిఖీలు చేయమన్నారా? ఇదేవిధంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల వాహనాలు తనిఖీ చేస్తున్నారా అంటూ చిందులు తొక్కారు. విధుల్లో ఉన్న ఎస్ఐ ప్రతి ఒక్క వాహనం తనిఖీ చేస్తున్నామని చెప్పినా వినకుండా పోలీసులను భయభ్రాంతులకు గురిచేశారు. వాస్తవానికి ఆ సమయంలో నరసరావుపేట వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి. అనిల్‌కుమార్‌యాదవ్ కాన్వాయ్‌ను ఆపి తనిఖీలు చేశారు. తనిఖీల అనంతరం నారా లోకేష్ తాడేపల్లిలో ఏర్పాటు చేసిన సభలో ప్రజల సానుభూతి లభిస్తుందని ప్రతిసారి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే నన్ను, నా కారును ఆపి తనిఖీలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఎన్నికల అనంతరం వారి సంగతి తేలుస్తానంటూ ఒక పక్క తన మీద సానుభూతి కురిపించుకుంటూ మరో పక్క ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ పంపిస్తున్నారు. పోలీసులను ఇప్పుడు కనుక తమదైన శైలిలో బెదిరిస్తే రాబోయే కాలంలో తన కారును తనిఖీ చేయరని, తమ కారులోనే వార్డుల వారీగా డబ్బుల మూటలు పంపించవచ్చని ఆలోచనతో లోకేష్ టీడీపీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొడుతున్నారనే భావన ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.



నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

జిల్లా మైనింగ్ శాఖాధికారి రాజేష్

బాపట్ల టౌన్: అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ శాఖాధికారి రాజేష్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఇసుక రీచ్‌ల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ తవ్వకం జరగడం లేదని వెల్లడించారు. ఇసుక అక్రమ రవాణాదారుల నుంచి చిన్న గంజం ప్రాంతంలో రూ. 2.30 లక్షలు, కొల్లూరు ప్రాంతంలో రూ. 3లక్షలు , అద్దంకి ప్రాంతంలో రూ. 50 వేలను అపరాధ రుసుంను వసూలు చేసినట్లు చెప్పారు. కొల్లూరు ప్రాంతంలోని గాజుల్లంక, జువ్వలపాలెం, ఓలేరు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు అన్ని అనుమతులు పొంది ప్రారంభంకానున్నాయని తెలిపారు. ఇప్పటికే మైనింగ్ సిబ్బంది జిల్లా అంతటా విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, అక్రమ ఇసుక తవ్వకదారులపై ఉక్కుపాదం మోపినట్లు ఆయన చెప్పారు. వీరితోపాటు నిత్యం సెబ్, రెవెన్యూ, పోలీస్ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

వైభవంగా అష్టలక్ష్మి జయంతి వేడుకలు



అమ్మవారికి గజవాహనంపై ఊరేగింపు

తెనాలి: స్థానిక కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మీ పీఠంలో శ్రీఅష్టలక్ష్మి అమ్మవార్ల 26వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీదండి స్వాముల దివ్యాశీస్సులతో ఉదయం నాలుగు గంటలకు మహాభిషేకంతో వేడుకలను ఆరంభించారు. అనంతరం ఆరగింపు సేవ, హారతి, సహస్ర నామార్చన, హారతి, తీర్థప్రసాదాల వినియోగం జరిగాయి. కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం నుండి గజవాహనంపై అమ్మవారికి ఊరేగింపును వైభవంగా జరిపించారు. ఊరేగింపులు కోలాట ప్రదర్శనలు ఆకర్షణీయంగా సాగాయి. రాత్రి కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఊంజల సేవ చేశారు. తదుపరి నంబూరు శ్రీకాళీ వనాశ్రమ పీఠాధిపతి చంద్రకాళీ ప్రసాద మాతాజీ, పెదపులిపాక శ్రీవిజయ రాజేశ్వరీ శ్రీవిద్యాపీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామి, బళ్లారిలోని శ్రీగురుగీత మందిరాధిపతి నిత్యానంద భారతి స్వామి ప్రవచనం చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమ్మణ్యం, పీఠాధిపతులు పర్యవేక్షించారు.

మరణాలకు కారకులను కఠినంగా శిక్షించాలి

తెనాలి: అన్నమయ్య జిల్లా, ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరం గ్రామానికి చెందిన చేనేత కుటుంబసభ్యులు పాల సుబ్బారావు, ఆయన భార్య, కుమార్తె మరణాలకు కారకులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఆ సంఘటన మొత్తంపై సమగ్రమైన న్యాయవిచారణ జరిపించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పాల సుబ్బారావు కుటుంబానికి చెందిన భూమిని వారికి కాకుండా తారుమారు చేయడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా కారకులైన వారిపై సెక్షన్ 306 ఐపీసీ కింద కేసు నమోదు చేయాలన్నారు. పెద్దకుమార్తె లక్ష్మీప్రసన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. లక్ష్మీ ప్రసన్నతో సోమవారం ఫోనులో మాట్లాడి సంఘం తరపున సానుభూతి తెలియజేశామనిన పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే యువతకు ఉపాధి అవకాశాలు



బాలాజీని కలిసిన రాజుబంగారుపాలెం యువకులు



బాలాజీని సత్కరిస్తున్న పర్చూరు అంబేడ్కర్ యూత్ సభ్యులు

పార్టీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ

చినగంజాం: రాష్ట్రంలో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు చూపిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనని పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన్ను కలిసేందుకు వచ్చిన యువతను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వం నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసం చేసిందని విమర్శించారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. గ్రామీణ యువకుల్లో దాగున్న ప్రతిభను వెలికితీసే కార్యక్రమంలో భాగంగా ఆడుదాం ఆంధ్రా నిర్వహించారన్నారు. ఎంతో మంది మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సాహకం అందించారని తెలిపారు. గ్రామాల్లో యువత ఐక్యంగా ఉండి రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనకు పర్చూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన 20 మంది యువకులు, చినగంజాం మండలం రాజుబంగారుపాలేనికి 40 మంది యువకులు కలసి శాలువా కప్పి, పూలబొకేను అందజేసి సత్కరించారు. తామంతా పర్చూరు నియోజకవర్గంలో బాలాజీ గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పెమ్మసాని వివాదాస్పద వ్యాఖ్యలు

- ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేశారంటూ ముస్లింల ఆవేదన
- క్షమాపణ చెప్పాలని డిమాండ్
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం



లాంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

తాడికొండ: వైఎస్సార్ సీపీ నాయకులు సద్దాం హుస్సేన్‌లా వ్యవహరిస్తున్నారంటూ గుంటూరు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు సద్దాం హుస్సేన్‌లా ప్రవర్తిస్తున్నారని, సద్దాం హుస్సేన్ కూడా తన ఇష్టారీతిగా వ్యవహరించినందునే బంకర్‌లో దాగి ఉన్నాలొక్కొచ్చి కుక్కను కొట్టినట్లు కొట్టి చంపారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ గురించి మాట్లాడకుండా ముస్లిం మనోభావాలను కించపరిచేలా సద్దాం హుస్సేన్ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పెమ్మసాని క్షమాపణ చెప్పాలంటూ కోరారు. పెమ్మసాని పలు కార్యక్రమాల్లో నోటికొచ్చినట్లు మాట్లాడటం పరిపాటిగా మారడంతో ఇప్పటికే ఆయన వైఖరిపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సద్దాం హుస్సేన్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పెమ్మసాని క్షమాపణ చెప్పాలని పలువురు డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర యువకుడు అరెస్ట్

గుజారాత్‌లో అరెస్ట్ చేసిన తెనాలి పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐ దశరథ రామారావు, ఎస్ఐ సుబ్బయ్య

తెనాలిరూరల్: ప్రేమ పేరుతో వంచించి మైనర్ బాలికపై లైంగిక దాడి చేసి గర్భవతిని చేసి పరారైన మహారాష్ట్ర యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక వన్ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్ వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన మైనర్ బాలిక షరాఫ్ బజారులోని వస్త్ర దుకాణంలో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తుంది. మహారాష్ట్రకు చెందిన కొందరు యువకులు బంగారు ఆభరణాల తయారీ పనులు చేసేందుకు తెనాలి వచ్చి షరాఫ్ బజార్ ప్రాంతంలోనే గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వీరిలో సోలాపూర్‌కు చెందిన ప్రశాంత్ జగదీష్ ఫడత్రే అలియాస్ ప్రశాంత్ ఫడత్రేకు బాలికతో స్నేహం ఏర్పడింది. తనను ప్రేమిస్తున్నా, పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో బాలిక గర్భందాల్చగా విషయం తెలుసుకున్న అతడు తెనాలి విడిచి పరారయ్యాడు. మోసపోయిన బాలిక జనవరి 29న పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు నిందితుడి ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నించారు. సీఐ జి. దశరథరామారావు నేతృత్వంలో ఎస్ఐ వై. సుబ్బయ్య, ఏఎస్ఐ కె. రత్నరాజు, కానిస్టేబుల్ ఎస్‌కేఎండీ షరీఫ్‌ల బృందం యువకుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టగా సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితుడు గుజరాత్‌లోని భావనగర్‌లో ఉన్నట్టు తెలుసుకున్నారు. అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకుని తెనాలి తీసుకువచ్చారు. సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితుడి ఆచూకీ గుర్తించేందుకు సమర్థవంతంగా పని చేసిన అధికారులు సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

బంగారం మాయం.. ఉద్యోగి ఆత్మహత్య

సంస్థలోనే బంగారం ఉన్నట్లు సిబ్బంది ప్రకటన

కొల్లూరు : బంగారం, వెండి వస్తువులు తాకట్టు పెట్టుకుని నగదు లావాదేవీలు నిర్వహించే ఓ ప్రైవేటు సంస్థలో బంగారం మాయం అవడంతో మనస్తాపానికి గురైన ఆ సంస్థ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా తంబడపల్లికు చెందిన పిన్నెబోయిన బాలశేఖర్ (21) డిగ్రీ పూర్తయిన అనంతరం మణప్పురం సంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆదరవుగా ఉన్నాడు. గిద్దలూరు, వినుకొండ బ్రాంచ్‌లలో పని చేసిన అతను ఈనెల 12న కొల్లూరు బ్రాంచ్‌కు ట్రాన్స్‌ఫర్‌పై వచ్చాడు. గతంలో కొల్లూరులో పనిచేసిన మేనేజర్ బదిలీ అవడంతో, నూతనంగా వచ్చిన మేనేజర్ సంస్థలో బంగారం నిల్వ లెక్క చూసుకునే సమయంలో ఎనిమిది గ్రాములు కనిపించకుండా పోవడంతో బాలశేఖర్ ఆందోళనకు గురయ్యాడు. మేనేజర్ తిరిగి పరిశీలిద్దాం.. ఉంటుందిలే ! అని నచ్చచెప్పినప్పటికీ, అతని బంధువులకు ఫోన్ చేశాడు. వారు కూడా అవసరమైతే నగదు చెల్లిద్దాం ఆందోళన చెందవద్దని సూచించారు. అయితే, ఆ సంస్థ ఆవరణలోనే ఉన్న గదిలో మేనేజర్‌తో కలసి ఉంటున్న బాలశేఖర్ 23 అర్ధరాత్రి వాంతులు చేసుకుంటుండటంతో ఆయన ఏమైందని ప్రశ్నించారు. బంగారం పోవడంతో నింద తనపై పడుతుందన్న ఆందోళనతో కలుపు మందు తాగినట్లు తెలపడంతో హుటాహుటిన గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున బాలశేఖర్ మృతి చెందాడు. మృతుడి తల్లి రాజమ్మ ఫిర్యాదు మేరకు కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, కనిపించకుండా పోయిన ఎనిమిది గ్రాముల బంగారం సంస్థకు చెందిన లాకర్‌లో పేపర్ల కింద ఉన్నట్లు సిబ్బంది తెలిపినట్లు ఏఎస్ఐ అర్జున్ పేర్కొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకొని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చినగంజాం: చినగంజాం నుంచి ఉప్పుగుండూరు వెళ్లే మార్గంలో రైల్వే వంతెనకు సుమారు 100 మీటర్ల దూరంలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టని విధంగా కుళ్లి పోయింది. వయస్సు 25 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. శరీరంపై జీన్స్ ప్యాంట్, షర్ట్ దానిపై స్వెట్టర్, స్కార్ఫ్ కూడా ఉంది. చనిపోయి వారం రోజులు అయి ఉంటుందని, రైల్వే పనులు నిమిత్తం వేరే రాష్ట్రం నుంచి వచ్చిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించనున్నట్లు ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు తెలిపారు.

త్రివిధ దళాల సైనికుల సేవలు వెలకట్ట లేనివి



అంజిరెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న, రెడ్డి వరప్రసాద్, గ్రామస్తులు

రాష్ట్ర త్రివిధ దళాల సైనికుల కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరప్రసాద్

రెంటచింతల: దేశ రక్షణ కోసం త్రివిధ దళాల సైనికులు చేస్తున్న సేవలు వెలకట్ట లేనివని రాష్ట్ర త్రివిధ దళాల మాజీ సైనికుల కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పశర్లపాడు గ్రామానికి చెందిన వాయుదళ మాజీ సైనికుడు పమ్మి అంజిరెడ్డి (46) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న రాష్ట్ర త్రివిధ దళాల మాజీ సైనికుల కమిటీ చైర్మన్ రెడ్డి శ్రీనివాస వరప్రసాద్, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి షేక్ కాలేషాతో పాటు త్రివిధ దళాలకు చెందిన వారు సందర్శించి మృతదేహంపై జాతీయ పతాకాన్ని కప్పి కవాతు ప్రదర్శన ద్వారా ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ సైనికుల జోహార్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఈ సందర్భంగా రెడ్డి శ్రీనివాస వరప్రసాద్ మాట్లాడుతూ అంజిరెడ్డి 20 సంవత్సరాల పాటు వాయుదళంలో ఎంతో అంకిత భావంతో విధులు చేపట్టారని పేర్కొన్నారు. అంజిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సైనిక్ బోర్డు విశ్రాంత ముఖ్య సంచాలకులు బ్రిగేడియర్ వెంకటరెడ్డి, ఐటీ ఇంచార్జి ప్రశాంత్, సంక్షేమ అధికారిణి గుణశీల, కోశాధికారి వంశీకృష్ణ, జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ముఖ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఇన్ కంటాక్స్ ఎస్ఐ కామిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌తో కేఎల్‌యూ ఒప్పందం



పత్రాలను చూపుతున్న పార్థసారథి వర్మ, చిత్రంలో ఈసీఈ విభాగాధిపతి సుమన్

తాడేపల్లి రూరల్ : రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సైబీరియన్ బ్రాంచ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్ టెరెస్ట్రియల్ ఫిజిక్స్ సంస్థతో కేఎల్‌యూ ఈసీఈ విభాగం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కె.పార్థసారథి వర్మ తెలిపారు. తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్‌యూలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరిక్ష వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులపైన పరిశోధనలు, శాస్త్ర సాంకేతిక రంగంలో పరస్పర సహకారం కోసం ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ఆయన వివరించారు. దీనివల్ల కేఎల్‌యూలోని ఈసీఈ విభాగం అంతరిక్ష వాతావరణంపై దృష్టి సారించి శాస్త్రీయ, విద్యాపరమైన సహకారం కోసం ఫ్రేమ్ వర్క్‌ను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. యూనివర్సిటీ, ఐఎస్టీపీ - ఆర్ఎఎస్‌ల మధ్య సన్నిహిత మైత్రిని ఏర్పరచడానికి, ఉమ్మడి శాస్త్ర సాంకేతిక కార్యకలాపాల్ని సులభతరం చేయడానికి అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినట్లు పేర్కొన్నారు. తమ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ డి. వెంకటరత్నం సంబంధిత బృందాలకు నాయకత్వం వహిస్తున్నారని చెప్పారు. జీఎన్ఎస్ఎస్ డేటా మార్పిడి, పరిశోధన సిబ్బంది, ఉమ్మడి ప్రాజెక్టులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు తదితర వాటిపై పరస్పర సహకారం రెండు సంస్థల మధ్య ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం. సుమన్, డాక్టర్ ఎం. శ్రీధర్, డాక్టర్ సంపత్ కుమార్ పొండా పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నంబూరు–రెడ్డిపాలెం కేబిన్ వద్ద సుమారు 23 సంవత్సరాల యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి నిడుమర్రు గ్రామానికి చెందిన కొత్తపూగు చిన్న వీరయ్య సెక్యూరిటీ గార్డ్‌గా పని చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. వీరయ్యకు ఇద్దరు మగ సంతానం ఉన్నారు. రెండో కుమారుడు కొత్తపూగు మహేష్ (23) డిగ్రీ పూర్తి చేసి ఓ ప్రైవేట్ సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం మంగళగిరిలోని సినిమాకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు తెలియజేసి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సాయంత్రం 6 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం రైలు పట్టాలపై పడి ఉన్నదని జీఆర్పీ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి ఎస్సై రమేష్ సిబ్బంది చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించి చుట్ట పక్కల వారిని విచారించారు. గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి మార్చురికి తరలించారు. సోమవారం మృతుడి పేరు కొత్తపూగు మహేష్‌గా గుర్తించిన కుటుంబ సభ్యులు జీఆర్పీ పోలీసులకు సమాచారం తెలియజేశారు. కుటుంబ సభ్యులను విచారించగా కొంత కాలంగా మృతుడు ఆందోళనగా ఉన్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు ఆత్మహత్య కింద కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు విచారణలో తెలాల్సి ఉందని రైల్వే జీఆర్పీ పోలీసులు వెల్లడించారు.

కనుల పండువగా లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

- ఎమ్మెల్యే కాసు, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ పూజలు
- స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పణ



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే కాసు, అనిల్ కుమార్ యాదవ్

దాచేపల్లి : స్థానిక ముత్యాలంపాడు రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ పూజారి నల్లజర్ల నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి వార్షిక కల్యాణం కన్నుల పండువగా జరిపించారు. అనంతరం కుంకుమ బండ్లను ఊరేగించారు.

పట్టు వస్త్రాలు సమర్పణ

శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి తిరునాళ్ల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి ఆంజనేయులు నివాసం నుంచి అమ్మవారి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్ తీసుకెళ్లారు. మేళ తాళాలతో పట్టు వస్త్రాలను ఊరేగించిన పిదప అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, పార్టీ నేత కొప్పుల సాంబయ్య, మాజీ పట్టణ కన్వీనర్ మునగా పున్నారావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ,, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, మాజీ సర్పంచ్ మండపాటి రమేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కందుల జాను, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, నాయకులు దాచేపల్లి సైదారావు, షేక్ ఖాదర్ భాషా, మునగా శ్రీనివాసరావు, కుందురు తిరుపతి రెడ్డి, పొనాది వెంకట నారాయణ, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.